క్లుప్తంగా

ప్రధాన డ్రెయిన్‌లో పూడిక తొలగింపు



అంగర డ్రెయిన్‌లోని పూడిక తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

కపిలేశ్వరపురం: అంగర ప్రధాన డ్రెయిన్‌లో పేరుకుపోయిన పూడికను పారిశుధ్య కార్మికులు గురువారం తొలగించారు. దాంతో నీటి పారుదలకు అడ్డంకి తొలగింది. డ్రెయిన్ నిండుకుని రహదారిపైకి మురుగునీరు పొర్లడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. పంచాయతీ కార్యదర్శి మహ్మద్ ఆలీ ప్రజాప్రతినిధులు చొరవతో పారిశుధ్య సిబ్బంది డ్రెయిన్‌లోని పూడికను తొలగించారు.

స్వామిత్వ సర్వేతో స్థిరాస్తులకు సాంకేతిక రక్షణ



నిడసనమెట్టలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణారెడ్డి

కపిలేశ్వరపురం: స్వామిత్వ సర్వేతో గ్రామాల్లోని స్థిరాస్తులకు సాంకేతిక రక్షణ ఉంటుందని తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. నిడసనమెట్ట గ్రామంలో గురువారం స్వామిత్వ సర్వే తీరుతెన్నులపై గ్రామసభ నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో చేపట్టిన సర్వే అనుభవాలను వివరించారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించడంతో స్థిరాస్తుల పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి కార్యదర్శి శివచక్రవర్తి, రీసర్వే తహసీల్దార్, సర్వేయర్, సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం ఎంపీడీవోగా నరేంద్రరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న నరేంద్రరెడ్డి

రాయవరం: రాయవరం ఎంపీడీవోగా కొవ్వూరి నరేంద్రరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన సూపరింటెండెంట్ డి.శ్రీనివాస్ నుంచి నరేంద్రరెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. కాకినాడలోని జెడ్పీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నరేంద్రరెడ్డి పదోన్నతుల్లో భాగంగా రాయవరం ఎంపీడీవోగా నియమించారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ తాను రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థినని, రాయవరంలో చదివి ఇదే మండలానికి ఎంపీడీవోగా రావడం సంతోషాన్ని కలిగించిందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకుని వెళ్తానని ఆయన తెలిపారు.

ఎంపీడీవోగా రత్నరాజు



రత్నరాజుకు స్వాగతం పలుకుతున్న పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది

కాజులూరు: స్థానిక ఎంపీడీవోగా ఐ.రత్నరాజు బదిలీపై వచ్చారు. ఈ మేరకు మండల పరిషత్ సిబ్బంది, పలు పంచాయతీల కార్యదర్శులు గురువారం ఆయన్ని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛంఇచ్చారు. ఇక్కడ పనిచేసిన అబ్రహం లింకన్ ఆరు నెలల కిందట దీర్ఘకాలిక సెలవుపై వెళ్లగా ఈఓపీఆర్డీ సీహెచ్ ఇందిరాదేవి ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొనసాగుతూ వచ్చారు. తాజాగా అంబాజీపేట మండల పరిషత్‌లో ఏఓగా పనిచేస్తున్న రత్నరాజు ఎంపీడీఓగా పదోన్నతి పొంది ఇక్కడకు వచ్చారు.

ఓఆర్ఎస్ ద్రావణం ప్రాధాన్యాన్ని గుర్తించాలి

కపిలేశ్వరపురం: ఎండవేడి బాగా పెరిగిన నేపథ్యంలో ఓఆర్ఎస్ ద్రావణం ప్రాధాన్యతను గుర్తించాలని అంగర పీహెచ్‌సీ సిబ్బంది సూచించారు. డయేరియా నివారణ పక్షోత్సవాల (ఐడీసీఎఫ్)అవగాహన కార్యక్రమంలో భాగంగా పడమర ఖండ్రిక గ్రామంలోని 39వ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ప్రయోగాత్మక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని తయారు చేయడంపై ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దేవి, వైద్య ఆరోగ్య కార్యకర్త చెల్లుబోయిన బేబీ, ఆశ కార్యకర్త పి.సుజాత, అంగన్‌వాడీ కార్యకర్త కొమ్మిశెట్టి వరలక్ష్మి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆపమన్నేవారేరీ..!

- బట్టీలకు తరలిపోతున్న మట్టి
- లేఅవుట్లకు యథేచ్ఛగా అక్రమ రవాణా
- పేట్రేగిపోతున్న మాఫియా



గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎదుట నుంచి బట్టీలకు తరలిపోతున్న మట్టి



బందనపూడి రెవెన్యూ పరిధిలోని పొలంలో మట్టిని తవ్వి ట్రాక్టర్లపై ఎగుమతి చేస్తూ..

కాజులూరు: గోదావరి నదీ తీరానికి ఆనుకుని ఉన్న కాజులూరు మండల గ్రామాలు ఒకప్పుడు పంట పొలాలు, వాటి మధ్య ఇసుక దిమ్మెలు, తోటలతో పచ్చగా కళకళలాడుతుండేవి. కోనసీమకు సరిహద్దులోని ఈ మండల గ్రామాలు కొబ్బరి, మామిడి తోటలతో ఆ స్థాయికి ఏ మాత్రం తీసిపోనట్టుగా ఉండేవి. ఇటీవల మట్టి మాఫియా కళ్లు ఇక్కడి మట్టి, ఇసుక దిమ్మెలపై పడటంతో అవి క్రమేపీ కనుమరుగవుతున్నాయి. మండలంలోని గొల్లపాలెం, శలపాక, తణుకువాడ, బందనపూడి, ఆర్యావటం తదితర గ్రామాల నుంచి అధికంగా మట్టి అక్రమంగా తరలిపోతోంది. గత ఏడాది ఈ అక్రమ తవ్వకాలపై సుమారు నాలుగు కేసులు నమోదయ్యాయి. ఇక్కడి ఇసుక, మట్టి పుదుచ్చేరిలోని యానాంతో పాటు సమీపాన ఉన్న రామచంద్రపురం, కాకినాడ తదితర పట్టణాల్లోని లేఅవుట్లకు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. పొలాల్లో మెరక పల్లాలను చదును చేసుకునేందుకు కొందరు రైతులు మట్టిని తవ్వి మరోచోటకు తరలిస్తుంటారు. వాస్తవానికి పొలాల్లో ట్రక్కు మట్టి తీయాలన్నా రెవెన్యూ, గనుల శాఖ అధికారుల అనుమతులు తప్పనిసరి. ప్రతి ట్రక్కుకు వే బిల్లు కచ్చితంగా ఉండాలి. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు సైతం మెరక పల్లాలు చదును విషయంలో చూసీచూడనట్టు వదిలేయమని సిబ్బందికి సూచిస్తుంటారు. మెరక పల్లాల వంకతో వ్యాపారులు పొలంలో మట్టిని, ఇసుక తిమ్మెలను తవ్వి లేఅవుట్లకు, ఇటుకల బట్టీలకు తరలిస్తున్నారు. స్థానిక అధికారులు ఈ అక్రమ తవ్వకాలను ప్రోత్సహిస్తున్నారని పలువురు అంటున్నారు. గతంలో ట్రాక్టర్లతో సాగే వ్యాపారం లారీల స్థాయికి చేరుకున్నప్పటికీ ఏ ఒక్కదానికి మైనింగ్ బిల్లు చెల్లించిన దాఖలాలు ఉండటం లేదు. పొలాల నుంచి నివాసాల మీదుగా ట్రాక్టర్, లారీలతో మట్టి రవాణా జోరుగా సాగుతుండటంతో విలువైన రహదారులు ధ్వంసమవుతున్నాయి. పలుచోట్ల రోడ్డుపై తిరిగే చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చేయిదాటిన పరిస్థితి..

ఆర్యావటంలో ఒక రైతు గృహ నిర్మాణంలో భాగంగా తన పొలంలో మెరక తీసుకుని ఆ మట్టిని తన ఇంటి పునాదుల్లోకి తీసుకు వెళుతుండగా అడ్డుకున్న రెవెన్యూ అధికారులు లే అవుట్‌లు, ఇటుక బట్టీలకు వందల కొలదీ లారీలతో మట్టిని తరలిస్తున్నా పట్టించుకోకపోవడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. గొల్లపాలెం మెయిన్‌రోడ్డులో విచ్చలవిడిగా తిరుగుతున్న మట్టి ట్రాక్టర్లను బుధవారం కొందరు యువకులు అడ్డుకున్నారు. అధికారులకు ముడుపులు చెల్లించే తాము మట్టి తోలుతున్నామని, అటువంటప్పుడు ఎవరైనా అడ్డుకుంటే ఎందుకు ఊరుకుంటామని మట్టి వ్యాపారులు బాహాటంగానే యువకులపై ఎదురు తిరిగినట్లు సమాచారం. ఇదంతా పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరిగింది. చివరికి యువకులే కాస్త తగ్గి ట్రాక్టర్ల వేగాన్ని తగ్గించమని మట్టి వ్యాపారులను బతిమలాడుకుని వెళ్లిపోయారు. దీనిపై తహసీల్దార్ బి.సాయి సత్యనారాయణను 'సాక్షి' వివరణ కోరగా మట్టి తరలింపునకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని ఆయన హెచ్చరించారు.

పార్టీ గెలుపునకు సమష్టిగా పనిచేద్దాం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో జనసేన, టీడీపీల నుంచి భారీగా వైఎస్సార్ సీపీలో చేరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పూర్వం నుంచి ఉన్న వారు, కొత్తగా చేరిన వారు వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా పాటుపడాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. మండలంలోని ఏడిద గ్రామంలో జనసేన, టీడీపీలకు చెందిన నాయకులు అధిక సంఖ్యలో ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామంలోని భావన్నారాయణస్వామి ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట, యువనేత తోట పృథ్వీరాజ్ వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ అవినీతికి తావివ్వకుండా, కులమత వర్గాలు, రాజకీయాలు చూడకుండా సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల చెంతకే చేరవేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటెయ్యని వారు జగన్ పాలన చూసి వచ్చే ఎన్నికల్లో ఆయనకు ఓటేసి రుణం తీర్చుకుంటామని ఆనందంగా చెబుతున్నారన్నారు. జనసేన నుంచి పార్టీలోకి వచ్చిన వాసిరెడ్డి అర్జున్, పువ్వుల నాని, గంధం దేవీవరప్రసాద్, రామిశెట్టి నాగేంద్ర తదితరులు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ సీఎం కావాలన్న ఆశతో ఏళ్లతరబడి ఎన్నో కష్టనష్టాల కోర్చి జనసేన పార్టీ కోసం అహర్నిశలు శ్రమించామన్నారు. అయితే తాను సీఎం రేసులో లేనని పవన్‌కల్యాణ్ చెప్పిన మాటలు తమను ఎంతో బాధించాయన్నారు. టీడీపీ నుంచి వచ్చిన వల్లూరి భీమయ్య, ధర్మాల వెంకన్న, సలాది రాంబాబు తదితరులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఇలాంటి సంక్షేమ పాలన చూడలేదన్నారు. సీఎం జగన్ పాలన, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వానికి ఆకర్షితులై తాము పార్టీలో చేరామని ఈ సందర్భంగా జనసేన, టీడీపీ నుంచి వచ్చిన నాయకులు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి అంతా కలసికట్టుగా పనిచేస్తామన్నారు. ఏడిద పంచాయతీ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో పెద్దిరెడ్డి సురేంద్ర, సరిగప్పుల మణికంఠ, దుర్గారావు, బల్లిపాటి దుర్గాప్రసాద్, కామన నాగరాజు, తూము వీరబాబు, ఉడతా రమేష్, మిద్దే సతీష్‌కుమార్, పులిదిండి సత్యనారాయణ ఉన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



మహిళకు ఇంటి పట్టాను అందజేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంతో పేదల సొంతింటి కల సాకారమవుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. గురువారం హసనాబాద్‌లో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు అధ్యక్షతన జగనన్న ఇళ్ల పట్టాల కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పేదలకు అందిస్తున్న కాలనీల్లో గృహ నిర్మాణం చేపట్టడంతో పాటు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 15 వేల మంది అక్కచెల్లెళ్లకు జగనన్న కాలనీలు గూడునిస్తున్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందిస్తున్నారన్నారు. ఇవి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలుస్తారని మంత్రి అభివర్ణించారు. రామచంద్రపురం మండలం హసనాబాదులో 18 ఎకరాల్లో 747 మంది లబ్ధిదారులకు మంత్రి ఇళ్ల పట్టాలు అందించారు. జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో ఒక్కో స్థలం రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షల విలువ చేస్తుందని మంత్రి వివరించారు. పట్టాలు పొందిన అర్హులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాఖ బేబీ, తహసీల్దార్ సర్వేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి కుటుంబానికి ఎమ్మెల్సీ తోట పరామర్శ

మండపేట: పట్టణానికి చెందిన ధాన్యం కమీషన్ వ్యాపారి గొలుగూరి కోదండ వెంకట రామారెడ్డి కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన రామారెడ్డి ఇటీవల దారుణ హత్యకు గురైన విషయం విదితమే. తీవ్ర విషాదంలో ఉన్న ఆయన భార్య శ్వేతనాగదేవి, కుటుంబ సభ్యులు మల్లిడి శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి తదితరులను ఎమ్మెల్సీ కలిసి వారికి ధైర్యం చెప్పారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోను సహించేది లేదని, చట్టపరంగా కఠిన శిక్ష పడేందుకు కృషి చేస్తామన్నారు. పారిశ్రామికవేత్తలు మేడపాటి రామలింగారెడ్డి, చింతా రామకృష్ణారెడ్డి, పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి విజయభాస్కరరెడ్డి, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ చిట్టూరి సతీష్, వైఎస్సార్ సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, సత్తి వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

బాబా ప్రసాద్ కుటుంబానికి..

కపిలేశ్వరపురం: ఇటీవల సంధిపూడి–కొత్తూరు సెంటర్ రహదారిలో మట్టి ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో మృతి చెందిన సుంకర బాబాప్రసాద్ కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. కోరుమిల్లిలోని బాబాప్రసాద్ ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ డైరెక్టర్ సలాది అప్పారావు, మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, గ్రామ పెద్ద సుంకర బుజ్జి ఉన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం..

- అంతా సమన్వయంతో పనిచేయాలి
- మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: సచివాలయాల ఇన్‌చార్జులు, కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్దామని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద గురువారం సచివాలయ ఇన్‌చార్జులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందించారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన కొనసాగిస్తున్నారన్నారు. అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించేందుకు సచివాయల ఇన్‌చార్జులు పనిచేయాలని ఆదేశించారు. రోజూ ఆయా సచివాలయాల పరిధిలోని ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రానున్న కాలంలో పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి ఏవిధంగా తీసుకువెళ్లాలో సచివాలయ ఇన్‌చార్జులకు దిశానిర్దేశం చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రామచంద్రపురం రూరల్: ఇటీవల బతుకు తెరువు కోసం పనికి వెళ్లి తిరిగి వస్తుండగా నల్గొండ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెల్ల గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందారు. బాధిత కుటుంబాలను రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గురువారం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా తగు సాయం అందించేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సర్పంచ్ వి.సూరిబాబు, నాయకులు పంతగడ ప్రసాద్, ఏసుబాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

స్పందించారు... తాగునీరందించారు

సాక్షి ఎఫెక్ట్



కుళాయి ద్వారా తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వెంకటరామకృష్ణ

కె.గంగవరం: సుందరపల్లి గ్రామంలో తాగునీటి కొరతపై 'తాగేందుకు చుక్కనీరు కరువు' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో గురువారం కథనం ప్రచురితమైంది. దీనికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ స్పందించారు. ఆ గ్రామానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను పంపించి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరాపై ఆరా తీశారు. వెంటనే ప్రజలకు నీరు అందించాలని ఆదేశించారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కుళాయిల ద్వారా ఉదయం, సాయంత్రం మంచినీరు అందేలా ఏర్పాట్లు చేశారు. ఇకపై రోజూ రెండు పూటలా పూర్తి స్థాయిలో అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. సమస్య పరిష్కరించిన మంత్రి వేణుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- రూ.కోటితో కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



ఆలమూరులో శెట్టిబలిజ కమ్యూనిటీ హాలుకు భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: పేదరికం నిర్మూలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరులోని వైఎస్సార్ జగనన్న కాలనీ ఎదురుగా పెద్దకాలువ రోడ్డులో 50 సెంట్ల స్థలంలో రూ.కోటితో నిర్మించనున్న శెట్టిబలిజ కమ్యూనిటీ హాలుకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో సర్పంచ్ నేలపూడి లావణ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడారు. శెట్టిబలిజలు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న కమ్యూనిటీ హాలు తమ ప్రభుత్వంలో రూపుదిద్దుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రైవేట్ కమ్యూనిటీ హాలుకు ధీటుగా అత్యంత నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లో శెట్టిబలిజల అండతో మరోసారి అధికారంలోకి వచ్చి మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తమ చిరకాల వాంఛ నెరవేర్చిన ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డికి పార్టీల కతీతంగా మండల శెట్టిబలిజ సంఘీయులు కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఆలయ కమిటీ చైర్మన్ వనుం సూరిబాబు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి గంగాభవానీ, ఎంపీఏఎస్ అధ్యక్షులు యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, ఎంపీటీసీ వున్నమట్ల విజయకుమారి, నాతి కుమార్‌రాజా, ఎలుగుబంటి బూరయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రక్షణ గోడలు లేక..



దుగ్గుదుర్రు వద్ద రక్షణ గోడ లేక డ్రెయిన్‌లోకి పడిపోయిన ట్రాక్టర్ (ఫైల్)

కాజులూరు: దుగ్గుదుర్రులో అసంపూర్తి కల్వర్టుతో ప్రమాదం పొంచి ఉంది. సుమారు 16 ఏళ్ల కిందట డ్రెయిన్‌పై ఈ కల్వర్టు నిర్మించారు. అప్పట్లో అధికారులు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మాణాన్ని మరిచారు. ఫలితంగా ఇటుగా వెళ్లాలంటేనే భయాందోళన నెలకొంటుంది. ఈ కల్వర్టుకు ఇరువైపులా రోడ్డు మలుపు తిరిగి ఉంది. వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పితే సరాసరి డ్రెయిన్‌లోకి పడిపోతున్నాయి. ఇటీవల ఒక ట్రాక్టరు కల్వర్టుపై నుంచి డ్రెయిన్‌లోకి పడిపోగా డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించటంతో అతనికి త్రుటిలో ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న లారీ

అంబాజీపేట: స్థానిక బస్టాండ్ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఓ విద్యుత్ స్తంభాన్ని లారీ బలంగా ఢీకొనడంతో విరిగిపోయింది. స్థానికుల కథనం ప్రకారం.. లారీ వెనక్కి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. ఆ సమయంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. విద్యుత్ శాఖ ఏఈ ఎ.హరిబాబు తన సిబ్బందితో వచ్చి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

కళాకారులకు సత్కారం

మలికిపురం: స్థానికంగా గురువారం కళాకారులకు సన్మానం జరిగింది. మలికిపురం విచ్చేసిన డ్యాన్స్ మాస్టర్ రమేష్, పల్సర్ ఝాన్సీలను మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ శాలువాతో సత్కరించారు. విశాఖపట్నంలో డ్యాన్స్ అకాడమీ ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న రమేష్, ఝాన్సీలను అభినందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు దేవ దయానంద్, మోకా దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమాతో బాధితులకు భరోసా



బీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ఆపదలో కుటుంబ పెద్దను కోల్పోయి దిక్కుతోచని పేద కుటుంబాల వారికి వైఎస్సార్ బీమా పథకం కొండంత భరోసా ఇస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని మెర్నిపాడుకు చెందిన నర్సరీ కూలీ కె. నవీన్ జనవరిలో కడియం మండలం బుర్రిలంకలోని నర్సరీలో పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ప్రమాద ఘటన వేరే జిల్లా కావడంతో మెర్నిపాడు సర్పంచ్ గారపాటి సౌజన్య, వైఎస్సార్ సీపీ నేత అశోక్‌కుమార్ దంపతులు సంఘటనను ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకు వచ్చారు. అక్కడి అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి త్వరితగతిన బీమా సాయం మంజూరుకు కృషిచేశారు. ప్రభుత్వ సాయం రూ.5 లక్షల చెక్కును మృతుని భార్య పుష్పకు ఎమ్మెల్సీ తోట గురువారం అందజేశారు. యువనేత తోట పృథ్వీ రాజ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మండల సాగు సలహా మండలి సమావేశం

కపిలేశ్వరపురం: నల్లూరు సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల సాగు సలహా మండలి సమావేశం నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయ అధికారి కేవీఎస్ రమేష్ కుమార్ గురువారం తెలిపారు. మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలి సభ్యులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరవుతారన్నారు. ఖరీఫ్ సాగు సన్నద్ధత అంశాలు, పీఎం కిసాన్ 14వ విడత విడుదల, సాగు ప్రక్రియలో డ్రోన్‌ల వినియోగం, భూసార పరీక్షలు తదితర అంశాలపై చర్చించనున్నట్టు ఏవో తెలిపారు.

జల్‌జీవన్ మిషన్‌పై అవగాహన



టేకిలో అవగాహన ర్యాలీలో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది

కపిలేశ్వరపురం: జల్‌జీవన్ మిషన్‌తో గ్రామాలకు సురక్షిత తాగునీరు అందుతోందని ఆ పథకం అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. టేకి గ్రామంలో ఈ పథకంపై గురువారం అవగాహన ర్యాలీ, సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రజారోగ్యంలో నీరు కీలకమైన పాత్రను పోషిస్తుందని, శాస్త్రీయ ప్రమాణాలు మేరకే నీటిని వినియోగించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ప్రతినిధులు అన్నారు. తాగు నీటి ప్రాధాన్యతపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు బాలబాలాజీ పర్యవేక్షణలోని వేద పండితులు స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. గ్రామంతో పాటు పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, వెదురుమూడి, టేకి, కోరుమిల్లి గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ముళ్ల పొదల్లో వ్యక్తి మృతదేహం

రావులపాలెం: స్థానిక సెయింట్ పాట్రిక్స్ విద్యా సంస్థల ఎదురుగా జాతీయ రహదారి పక్కన ముళ్ల పొదల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్సై ఎం.వెంకటరమణ గురువారం తెలిపారు. మృతుడి వయసు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. నీలి రంగుపై ఎరుపు రంగు నిలువు గళ్లు కలిగిన ఫుల్ హ్యాండ్స్ షర్ట్, లేత పసుపు పచ్చ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. వివరాలు తెలిసిన వారు రావులపాలెం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో గురువారం మాస కల్యాణాలు ఘనంగా జరిగాయి. ఆయా ఆలయాల వద్ద ఉదయం స్వామి వార్లకు సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య, ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాత పాతపాటి రమణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ అవరణలో నిత్యాన్నదాన పథకానికి ఆచంట మండలం కరుగోరుమల్లి గ్రామానికి చెందిన కంఠంశెట్టి సత్యకృష్ణ, లలిత నాగపూర్ణిమ దంపతులు రూ.20 వేల విరాళం సమర్పించారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు.